క్లుప్తంగా

కబడ్డీ పోటీలు ప్రారంభం



దాచేపల్లి: మండలంలోని తంగెడ గ్రామంలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను నాయకుడు ఆంజనేయరాజు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పల్నాడు ప్రాంతంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రొత్సాహిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ఇటువంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఆంజనేయరాజు చెప్పారు. న్యాయనిర్ణేతలుగా షేక్ మస్తాన్‌వలి, లక్ష్మారెడ్డిలు వ్యవహరించారు. వంశీ, గోవిందు, ప్రసాద్, నజీర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఎయిడ్ ఇండియా నిర్మాణాల పరిశీలన



విజయపురిసౌత్: మాచర్ల మండలం పశువేముల గ్రామంలో వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ నిర్మించిన గ్రే వాటర్ సిస్టంను ఎంపీడీఓ కోటేశ్వరావు గురువారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన చాంబర్స్ ద్వారా వర్షపు నీటి నిల్వ, వాటర్ స్టోరేజ్ ట్యాంక్ మరమ్మతుల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తరువాత వాటర్ ఎయిడ్ ఇండియా ఐఎస్ మాడెబోయిన గురుప్రసాద్ మాట్లాడుతూ అన్ని నిర్మాణాలు సక్రమంగా పనిచేయటం కోసం ప్రతి నిర్మాణానికి ఒక ఆపరేషన్ నిర్వహణ కమిటీ ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బాబులాల్ నాయక్, వాటర్ ఎయిడ్ ఇండియా ఇంజినీర్ పవన్‌కుమార్, సీఎఫ్ రవివర్మ, సర్పంచ్ దేవదానం, మాజీ సర్పంచ్ కర్రా చిన్న రంగయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

– సీఐ పీవీ ఆంజనేయులు



పిడుగురాళ్ల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానం వలన సైబర్ నేరాల కూడా సాంకేతికత పుంతలు తొక్కుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, దగ్గర వ్యక్తిగా వేరే నెంబర్లనుంచి చాటింగ్, కాల్స్ చేస్తారని, బాగా అవసరమంటూ నమ్మబలికి నగదు అడుగుతారని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై అసలు వ్యక్తులను ఆరా తీసి, అప్పుడు మాత్రమే సాయం వంటివి చేయాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరు ఫోన్ చేసినా వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు అసలు ఎవరికి చెప్పవద్దని ఆయన తెలియజేశారు.

నేడు రెంటాలలో జగనన్న సురక్ష

రెంటచింతల: రాష్ట్రంలోని ప్రతి గడపలో నున్న అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం మండలంలోని రెంటాల గ్రామంలోని సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి గురువారం తెలిపారు. తహసీల్దార్ కె.పుల్లారావు, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రావు, డిప్యూటీ తహసీల్దార్ జె.రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందచేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా

సత్రశాల(రెంటచింతల): న్యాయమైన తమ డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని స్థానిక ఏపీ జెన్ కో ఉద్యోగులు గురువారం నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ జేఎల్ఎం గ్రేడ్–2 అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, జీపీఎఫ్ వర్తింప చేయాలని, అందరికీ ఒకే మాస్టర్ స్కేల్ ఇవ్వాలని, పూర్తి వైద్య సేవలు అందించాలని, ఏక సభ్య కమిషన్‌ను రద్దుచేయాలని, పీఆర్సీ 2022 తక్షణమే అమలు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సంఘం డిమాండ్ చేస్తున్నట్లు అయన తెలిపారు. ఈ నిరసనలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలకు ప్రాణం

- వర్షంతో అన్నదాతల హర్షం
- ఊపందుకున్న వ్యవసాయ పనులు

మాచర్ల రూరల్: ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న వరుణదేవుడు కొద్ది ఆలస్యమైనా బాగానే కరుణించాడు. వాయుగుండం రూపంలో అన్నీ మండలాల్లో వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలలో ఆనందం వెల్లివిరుస్తోంది.

సాగులోని పంటలన్నీ పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట పొలాలు పూర్తిస్థాయిలో పదునయ్యాయి. రైతుల మోముల్లో చిరునవ్వు తొణికిసలాడుతుంది. పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించటం. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించటమే కాకుండా ముందుగానే పెట్టుబడికి రైతు భరోసా నగదును అందించటం రైతన్నలకు ఎంతో చేదోడుగా ఉంది.

వర్షాతిరేకం..

గడిచిన మూడు రోజుల్లో మాచర్ల మండలంలో 72.8 మిల్లీ మీటర్లు, వెల్దుర్తి 70.2, దుర్గి 87.8, రెంటచింతల 129.0, కారంపూడి 68.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి మెట్ట ప్రాంత రైతులకు బోరు సాగుకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయి. మెట్ట ప్రాంత రైతులు వ్యవసాయ పనులను ముమ్మరంగా చేపట్టారు. ఇప్పటికే దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేసిన రైతులు విత్తనాలు నాటే పనిలో ఉండగా అరక, ట్రాక్టర్లతో సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఇక బోర్లు, కాలువల కింద వరి పండించే రైతన్నలు ఇప్పటికే నారు సిద్ధం చేసుకుంటూ భూమిని సాగులోకి తీసుకొని వరి పంట పండించేందుకు సిద్ధమవుతున్నారు.



జమ్మలమడక గ్రామంలో వరి పంటకు సిద్ధంగా ఉన్న వరినారు



మాచర్ల మండలంలోని కొత్తపల్లిలో ఏపుగా పెరిగిన పత్తి పంట

రైతులకు ఈ వానలు ఉపయోగకరం



మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే పత్తి, మిర్చి వేసిన రైతులకు మంచి ఉపయోగకరం, సాగు చేసి విత్తనాలు వేసేందుకు మంచి సమయం. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సామగ్రిని అందిస్తున్నాం.

– జగదీశ్వరరెడ్డి, ఏడీఏ

ఉత్సాహంగా పంటలు సాగు చేస్తున్నాం



వర్షాలు అనుకున్న సమయానికి కొన్ని రోజులు ఆలస్యమైనా కావాల్సినంత వర్షం పడింది. పంటలు సాగు చేసుకొనేందుకు సరిపోతుంది. రైతులకు అవసరమైన వసతులను సీఎం జగన్ సమకూరుస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటల నిర్వహణకు అవసరమైన సలహాలు, సూచనలు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే తక్షణమే పరిహారం దక్కుతుంది.

– ఆరికట్ల చంద్రారెడ్డి, రైతు, కంభంపాడు

ప్రజా సమస్యల వేదిక జగనన్న సురక్ష

- ఆర్‌డీఓ అద్దెయ్య
- అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

పిడుగురాళ్ల: ప్రజా సమస్యల వేదికగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని ఆర్‌డీఓ అద్దెయ్య అన్నారు. పట్టణంలోని 2వ సచివాలయ పరిధిలోని స్వర్ణ పిచ్చయ్య కాలనీలో రెండు, మూడు వార్డు ప్రజలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా గతంలో ఇంటిలో వారు హౌస్ హోల్ మ్యాపింగ్‌లో తేడాలు ఉంటే అవి పరిష్కరించుకోవచ్చునని ఆయన తెలియజేశారు. అంతే కాకుండా ప్రజలకు ఉచితంగా 11 రకాల ఉచితంగా సర్టిఫికెట్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 360 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. తహసీల్దార్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్ కొక్కెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్‌డీఓ అద్దెయ్య

కిసాన్ సమృద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



మాచవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కిసాన్ సమృద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రావమ్మ కోరారు. స్థానిక మన గ్రోమోర్ సెంటర్‌లో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కిసాన్ సమృద్ధి కేంద్రాల్లో నూతనంగా యూరియా గోల్డ్ సల్ఫర్‌తో కలిపిన ఎరువును ఆవిష్కరించారు. పీఎం కిసాన్ 14వ విడత నిధులను రైతుల ఖాతాలలోకి జమ చేసిన సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వివరించారు. మన గ్రోమోర్ మార్కెటింగ్ మేనేజర్ షేక్ జాకీర్ హుస్సేన్, జెడ్పీటీసీ శివాయాదవ్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, గ్రోమోర్ మేనేజర్ శివకుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఎం.నర్సయ్య, కరుణకుమారి రైతులు పాల్గొన్నారు.

దుర్గి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు రైతులకు ఎంతో లబ్ధిని చేకూరుస్తాయని బీజేపీ మండల కన్వీనర్ వెలదండి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మార్క్‌ఫెడ్ ఆగ్రో సర్వీస్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల వర్చువల్‌లో ప్రారంభోత్సవాన్ని వీడియోను స్థానిక రైతులు, అధికారులు, బీజేపీ నాయకులు వీక్షించారు. జిల్లా మేనేజర్ సాంబశివరావు, ఏఓ వై.అమీర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రేపు దాచేపల్లి తిరునాళ్ల



దాచేపల్లిలోని పీర్ల చావిడిలో అలంకరణ చేసిన పీర్లు



గంగిరెడ్డిపాలెంలో పీర్ల చావిడిలో సుందరంగా అలంకరించిన పీర్లు

నేడు పీర్లకు దట్టీలు సమర్పించనున్న ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి: మెహర్రం పండుగ వేడుకలకు సర్వం సిద్ధమైంది. మెహర్రం పండుగ నేపథ్యంలో శనివారం దాచేపల్లి తిరునాళ్ల జరుపుకొంటారు. ఈ నేపథ్యంలో దాచేపల్లితో పాటుగా పలు గ్రామాల్లోని చావిడిలలో పీర్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. దాచేపల్లిలోని రెండు చావిడిలలో గంధం పీర్లను అలంకరించటంతో భక్తులు అధికంగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. దాచేపల్లి బ్రహ్మణగడ్డ, నారాయణపురం, పొందుగల, గామాలపాడు, కేసానుపల్లి, తంగెడ, పెదగార్లపాడు, మాదినపాడు తదితరల గ్రామాల్లోని చావిడిలలోని పీర్ల వద్ద భక్తులు బొరుగులు, బెల్లంను సమర్పిస్తున్నారు. దాచేపల్లి తిరునాళ్ల సందర్భంగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. తిరునాళ్ల నేపథ్యంలో దాచేపల్లి హైస్కూల్ సమీపంలో రంగులరాట్నం, జెయింట్ వీల్స్‌ను ఏర్పాటు చేశారు.

పీర్లకు దట్టీలు సమర్పించనున్న ఎమ్మెల్యే..

స్థానిక శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం దాచేపల్లిలో పర్యటించనున్నారు. మెహర్రం పండుగ సందర్భంగా దాచేపల్లిలోని రెండు చావిడిలలో ఉన్న గంధం పీర్లను ఎమ్మెల్యే కాసు దర్శించుకుని దట్టిలు సమర్పిస్తారు. అనంతరం పలు చావిడిలలోని పీర్లను కూడా ఆయన దర్శించుకుంటారు.

గ్రామాల్లో పీర్ల సందడి..

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో మొహరం వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో పీర్ల సందడి మొదలైంది. ఆయా గ్రామాల్లో పీర్ల చావిళ్లల్లో పీర్లను సుందరంగా అలంకరించారు. ముజావర్లు పీర్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఊరేగింపునకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పలు షరగత్తులను నిర్వహించారు. చావిళ్ల వద్ద అగ్ని గుండాలను ఏర్పాటు చేశారు. మోహరం రోజున భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించేందుకు ముస్లింలు ఉత్సాహంగా ఉన్నారు.

వర్షానికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



పిడుగురాళ్ల: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణ శివారులోని చిన్న కాలువ సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పట్టణం నుంచి బ్రాహ్మణపల్లి, న్యూ వెల్లంపల్లి, కామేపల్లి గ్రామాలకు వెళ్తున్న విద్యుత్ వైర్లు కిందకు వాలి ప్రమాదభరితంగా మారింది. పొలంలో వాడటంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీందర్ రత్నాకర్

సత్తెనపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీందర్ రత్నాకర్ అన్నారు. ఏపీ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఆదేశానుసారం డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులు, డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన సదస్సు, దోమలు, లార్వా ఎలా వృద్ధి చెందుతాయి గంబూషియా చేపల ద్వారా లార్వాను భుజించు విధానంపై విద్యార్థినులకు ఎగ్జిబిషన్ ద్వారా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీందర్ రత్నాకర్ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు గుడ్లు, లార్వా, ప్యూపా ఈ మూడు దశలు నీటిలోనే ఏడు రోజులు నుంచి పది రోజుల్లోపు పెద్దదోమగా తయారవుతుందని చెప్పారు. అందువలన నీటి నిల్వలు ఇంటి లోపల, బయట లేకుండా చూడాలని, నీటి నిల్వలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులైన టైఫాయిడ్, డయేరియా వర్షాకాలంలో వ్యాప్తి చెందుతాయని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, బయట పదార్థాలు తీసుకోరాదన్నారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రభుత్వ వైద్యశాలను కానీ పట్టణ ఆరోగ్య కేంద్రాలకు కానీ వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షల కిట్లు సిద్ధంగా ఉన్నాయని, రక్త పరీక్షలు అన్నీ ఉచితంగా చేస్తారన్నారు. అన్ని రకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయన్నారు. సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ పార్థసారథి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నల్లబోతు సత్యవతి మాట్లాడారు. సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ హెల్త్ సూపర్వైజర్లు బి.రోశయ్య, వై.రాజేష్ పాల్, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్‌బాబు, ఎస్ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, సైన్స్ ఉపాధ్యాయురాలు వాసంతి, హెల్త్ సెక్రటరీ బి.పుణ్యవతి, శానిటరీ సెక్రటరీ ప్రదీప్, ఆరోగ్య కార్యకర్త ప్రియాంక, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దోమల ఉత్పత్తిపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రవీందర్ రత్నాకర్

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: పంచారామం లోని ప్రథమ పంచారామమైన బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామికి గురవారం వర్లకేశ్వరరావు దంపతులచే లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చకస్వాములు నిర్వహించారు. శుక్రవారం ఆర్జీత సేవలలో భాగంగా శంకరమంచి చంద్రశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో జ్వాలాముఖి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త రాజావాసిరెడ్డి మురళీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. భక్తులు వేలాదిగా కుంకుమార్చనలో పాల్గొనాలని కోరారు.

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి

పిడుగురాళ్లరూరల్: అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కంటే నేడు మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు ఆ శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ అల్లు సత్యవతి పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒక్కో విద్యార్థి వద్ద రూ. 200 వసూళ్లు చేస్తున్నారని, అది ఎందుకు చేస్తున్నారని కారణాలు చెప్పాలని నిలదీశారు. దీనిపై ఎంఈఓ వై.శ్రీనివాసరావు స్పందిస్తూ తాను కొత్తగా విధుల్లో చేరానని, ఆ విషయంపై విచారణ చేయిస్తామన్నారు. మండల వ్యవసాయ శాఖ ఏఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్, రైతు భరోసా జమ కానీ వారు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సోమయ్య మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి కుళాయి ద్వారా కృష్ణా జలాలు అందించనున్నామన్నారు. వైద్యశాఖ అధికారి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ కాశయ్య, పశువైద్యశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంజలికుమారి, ఏపీఎం జయరాజు, ఆర్ఐ శ్రీనివాసరావు, పంచాయితీ రాజ్ ఏఈ సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా మండల శాఖాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

ఏఈ నూతలపాటి సింగయ్య

పిడుగురాళ్ల: విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖకు పరిశ్రమల వారు సహకరించాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పిడుగురాళ్ల సబ్ డివిజన్ బకాయి వసూళ్ల నోడల్ ఆఫీసర్ నూతలపాటి సింగయ్య అన్నారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన పట్టణంలోని పరిశ్రమల వారితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, సినిమా హాల్, ఫంక్షన్ హాల్, కమర్షియల్, హెచ్‌టీ, ఎల్‌టీ సర్వీసులకు ఇప్పటివరకు ఇస్తున్న కేవీఏఆర్‌హెచ్ లీడ్ బ్లాక్ చేశామని, దాని వలన కెపాసిటర్స్ తక్కువ ఉన్నప్పుడు మాత్రమే కేవీఏహెచ్ బిల్లింగ్ అవుతుందని, అవసరానికి మించి ఎక్కువ కెపాసిటర్ బిగించుకొని కరెంటును వాడుకుంటున్న సమయంలో (టీడ్ యూజ్ యూనిటీ) కేవీఏహెచ్ బిల్లులో దాని ప్రభావం ఉందని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు లీడ్ పవర్ ఫ్యాక్టరీ బ్లాక్(నిరోధం)లో ఉన్న మీటర్లను తొలగించి లీడ్ పవర్ ఫ్యాక్టరీ అన్ బ్లాక్ చేయబడిన మీటర్లు బిగించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాజ్జీనాయక్, ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల అసోసియేషన్ సభ్యులు పాల్గొని వారి సమస్యలను వివరించారు.



పరిశ్రమల యజమానులతో మాట్లాడుతున్న ఏఈ సింగయ్య

పారదర్శకంగా ఓటర్ల పరిశీలన

గురజాల ఆర్‌డీఓ అద్దెయ్య

పిడుగురాళ్ల: నిబద్ధతగా ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గురజాల ఆర్డీఓ అద్దెయ్య అన్నారు. పట్టణంలోని 2వ వార్డులోని 259 బూత్ సంబంధించిన ఓటర్ల పరిశీలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాల ఆర్డీఓ కార్యాలయ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో నిబద్ధతగా ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు. దొంగ ఓట్లకు సంబంధించి, స్థానికంగా ఎన్ని పార్టీలు ఉంటే వారందరిని కలుపుకొని పరిశీలన నిర్వహిస్తున్నామని, అదేవిధంగా ఓటరు ఎవరైనా చనిపోయి ఉంటే వారి డెత్ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతనే తొలగిస్తామని, అలా డెత్ సర్టిఫికెట్ లేకపోతే వారి కుటుంబ సభ్యుల నుంచి డెత్ డిక్లరేషన్ సర్టిఫికెట్ తీసుకొని తొలగిస్తామన్నారు. అదేవిధంగా రెండు ఓట్లు ఉంటే ఎక్కడ ఓటు కావా లో ఆ వ్యక్తిని అడిగి ఆ ఓటుకు ఆధార్‌ను లింక్ చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఓటర్ల పరిశీలన కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు హాజరై ఓటర్లను పరిశీలించుకోవాలని ఆయన తెలియజేశారు. కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కేవీ చక్రవర్తి, వైఎస్సార్ సీపీ బీఎల్ఏ కొక్కెర శ్రీను, పలు పార్టీల బీఎల్ఏలు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి..

దాచేపల్లి: బూత్ లెవల్ అధికారులు నిష్పాక్షపతంగా వ్యవహరించాలని తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలు, రాజకీయ పార్టీల నాయకుల సమావేశం గురువారం జరిగింది. వార్డుల వారీగా జరుగుతున్న ఓట్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులతో చర్చించారు. బీఎల్‌ఓలు రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించవద్దని, ఎన్నికల నియమావళి ప్రకారం విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన బీఎల్వోలపై చర్యలు తీసుకుంటామని, రాజకీయ పార్టీల నాయకులు అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం, ఆర్ఐ శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల పరిశీలన కార్యక్రమం అనంతరం మాట్లాడుతున్న ఆర్డీఓ అద్దెయ్య

దుర్గి మండలంలో...

దుర్గి: మండలంలోని పలు గ్రామాలలో కొనసాగుతున్న ఓటర్ సర్వే ప్రక్రియను తహశీల్దార్ ఎం.రమేష్ కుమార్ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. గురువారం దుర్గి కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌ఓలను కలిసి ఓటర్ సర్వే పై జరుగుతున్న ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లి కుటుంబ సభ్యులు వివరాలను తెలుసుకొని 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు కొత్త ఓట్లు నమోదు చేయించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం సర్వేను కొనసాగించాలన్నారు. ఓటర్ల అభ్యంతరాలను, సూచనలను స్వీకరించి వారి సమస్యలు పరిష్కరించే విధంగా బీఎల్‌ఓలు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఓటర్లకు సంబంధించిన వివిధ ఫారాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసి అదేవిధంగా ప్రతి రోజు సర్వే వివరాలను ఎప్పటికప్పుడు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని బీఎల్‌ఓలను కోరారు.

అబ్దుల్ కలాం చిరస్మరణీయుడు

మాచర్ల: మిసైల్ సృష్టికర్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో ఉత్తమ సేవలందించిన భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు అన్నారు. గురువారం కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పాషావలి, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, షేక్ నాగుల్ మీరా, గోలి శ్రీనివాసరావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఒరుగంటి చెన్న కేశవరావు, షేక్ చినలాలు సాహెబ్ తదితరులున్నారు.

